www.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 01 | సంచిక : 09 (కాంప్లిమెంటరీ కాపీ) | గురువారం | 11.04.2024

## 'కోడి' ధర పైపైకి..

### భారీగా పెరిగిన చికెన్ రేట్లు

- స్కిన్ లెస్ కిలో రూ.290,
- బోన్ లెస్ రూ.400 వరకు అమ్మకం



**జనగామ, మన చౌరాస్తా :** రంజాన్ పండుగ వేళ చికెన్ ధరలు భారీగా పెరగడంతో నాన్ వెజ్ ప్రియులకు షాక్ తగిలినట్టయింది. గతవారం రోజులుగా చికెన్ ధరలు పెరగడంతో రంజాన్ పండుగ జరుపుకునే మైనార్టీ సోదరులకు బడ్జెట్ పెరగనుంది. అయితే రెండరోజులుగా చికెన్ కిలో రూ.105 నుంచి రూ.115 వరకు, స్కిన్ లెస్ కిలో రూ.290, బోన్ లెస్ రూ.400 వరకు రిటైల్ మార్కెట్లో విక్రయించారు. అయితే ఎండాకాలంలో కోళ్ల మరణాల రేటు ఎక్కువగా ఉండటం ధరలు పెరగడానికి అసలు కారణమని వ్యాపారులు చెబుతున్నారు.వేడిని తట్టుకోలేక కోళ్లు పెద్ద సంఖ్యలో మృత్యువాత పడుతుండటంతో రైతులు నష్టపోతున్నారు. ఇక వారం క్రితం కిలో కోడి మాంసం ధర రూ.180 నుంచి రూ.220 వరకు ఉండేది. వేసవిలో కోళ్ల సరఫరా తక్కువగా ఉండటం కూడా ధరల పెరుగుదల కారణమవుతోంది. పౌల్ట్రీ రైతులు ఎయిర్ కూలర్ల ఏర్పాటు, ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ కోళ్లను పెంచుతున్నారు. అధిక డిమాండ్, తక్కువ సరఫరా కారణంగా ఈ నెలలో ధరలు విపరీతంగా పెరిగాయి. ఆదివారం చికెన్ కిలో రూ.115 నుంచి రూ.125 వరకు ఉండగా, నెల క్రితం రూ.70 నుంచి రూ.80 మధ్య ఉంది.ఈ నెలలో ఈద్ ఉల్ ఫితర్ తర్వాత భారీగా పెళ్లిళ్లు జరుగుతుండటంతో చికెన్ ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో మెనూను తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందంటున్నారు చాలామంది. చికెన్ ధరలు పెరగడమే ఇందుకు కారణమని ఫుడ్ కేటరర్లు కూడా చెబుతున్నారు. ఎండల తీవ్రత ఇలాగే కొనసాగితే ముమ్ముందు భారీగా ధరలు పెరిగే అవకాశం ఉంది. అయితే రంజాన్ సందర్భంగా మైనార్టీ సోదరులు ఎక్కువగా నాన్ వెజ్ తింటారు. అయితే పండుగ సందర్భంగా ధరలు పెరగడం షాక్ లాంటిదే మరి.



## వడదెబ్బపై అవగాహన పెంచాలి

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా

2



## కనీస మద్దతు ధరకు వడ్లను కొనాలి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


2



## ఈటల రాజేందర్ చెల్లని రూపాయి

- ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సంచన వ్యాఖ్యలు

2




## కేసీఆర్ హయాంలోనే తెలంగాణ అభివృద్ధి

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కేసీఆర్ అధికారంలోకి వచ్చాకే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జనగామ మండలం పసరమడ్ల గ్రామ పరిధిలోని ఉషోదయ ఫంక్షన్ హాల్‌లో పల్లా అధ్యక్షతన బీఆర్ఎస్ జనగామ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు.

3 లో

General News

# వడదెబ్బపై అవగాహన కల్పించాలి

- పాఠశాలల్లో మౌలిక వసతుల పనులను పూర్తిచేయాలి
- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా



**జనగామ, మన చౌరాస్తా :** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, తాగునీటి సరఫరా, అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతులు, సమ్మర్ యాక్షన్ ప్లాన్, ధాన్యం కొనుగోళ్లు, సీఎంఆర్, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) పింకేశ్ కుమార్, (రెవెన్యూ) రోహిత్ సింగ్, సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పాల్గొన్నారు. అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు అందించే వనరులను గుర్తించి ఏమైనా మరమ్మతులు ఉంటే వెంటనే పూర్తి చేయాలన్నారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ ప్రకారం ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిరంతరం తాగునీటి సరఫరా చేయాలన్నారు. సిఎంఆర్ రోజువారీ లక్ష్యాలను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ప్రారంభించిన కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా గుర్తించిన మౌలిక వసతుల పనులు వచ్చే విద్యా సంవత్సరం లోపు పూర్తవ్వాలని, జిల్లాలోని 273 పాఠశాలలకు సంబంధించి గుర్తించిన పనుల మోడల్ స్కూల్ ప్లాన్ లను, బడ్జెట్ అంచనా వ్యయానికి సంబంధించిన వివరాలను మూడు రోజుల్లోగా అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వేసవి కాలం దృష్ట్యా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పీహెచ్సీ కేంద్రాలు, సబ్ సెంటర్లలో ఔషధ నిల్వలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరిపడా అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జెడ్పీ సీఈవో, ఇంచార్జి డీపీవో అనిల్ కుమార్, డీసీఎస్ఓ రోజారాణి, డీఏఓ వినోద్ కుమార్, డీఆర్డీఓ మొగులప్ప, డీఎం సివిల్ సప్లై ప్రసాద్, డీఎం హెచ్ఓ హరీష్ రాజ్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల సంబంధిత అధికారులు పాల్గొన్నారు

## కనీస మద్దతు ధర చెల్లించాలి

– జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్

**లింగాలఘణపురం, మన చౌరాస్తా :** లింగాలఘనపురం మండలంలోని నెల్లుట్ల, పటేల్ గూడెం, చీటూర్ ఐకేపీ కేంద్రాలు, కుందారం పీఏసీఎస్‌లను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. కనీస మద్దతు ధరపై (A గ్రేడ్ రూ.2,203, కామన్ గ్రేడ్ రూ. 2,183) రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వివరించారు. అలాగే ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించాలని, ఎటువంటి నిర్లక్ష్యం తగదని అధికారులను ఆదేశించారు. వేయింగ్ మెషీన్లు, ప్యాడీ క్లీనర్లు, గన్నీ బ్యాగులను సరైన విధంగా నిర్వహించాలన్నారు. అదే విధంగా మౌలిక సదుపాయాల గురించి ఆరా తీశారు. ధాన్యం నిల్వలకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓపీఎంఎస్ లో ధాన్యం వివరాలను రోజువారీగా నమోదు చేయాలని తెలిపారు. ఆయన వెంట డీసీఎస్ఓ రోజా రాణి, సివిల్ సప్లైస్ డీఎం ప్రసాద్, డీటీ సీఎస్ శ్రీనివాస్, ఏపీఎంఎస్ శంకరయ్య ఉన్నారు.



## ఈటెలపై కౌశిక్ ఫైర్

**కరీంనగర్, మన చౌరాస్తా :** హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పై తీవ్ర ఆరోపణలు చేశారు. హుజురాబాద్ లో గత అసెంబ్లీ ఎన్నికల్లో చెల్లని రూపాయి మల్కాజ్ గిరిలో సార్వత్రిక ఎన్నికల్లో ఎట్లా చెల్లుతదని కౌశిక్ రెడ్డి ప్రశ్నించారు. హుజూరాబాద్, గజ్వేల్ ప్రజలనే కాకుండా అన్నం పెట్టిన కేసీఆర్ ను కూడా ఈటల రాజేందర్ మోసం చేసిందని కౌశిక్ రెడ్డి విమర్శించారు. ఇప్పుడు మల్కాజ్ గిరి ప్రజలను మోసం చేసేందుకు ఈటల ఇక్కడ పోటీ చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ మల్కాజ్ గిరి పార్లమెంటు నియోజకవర్గ సమావేశంలో కౌశిక్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. తన అక్రమ ఆస్తులను కాపాడుకునేందుకే ఈటల ఇక్కడ పోటీ చేసేందుకు వచ్చాడు. దేవుడి బొట్టు కూడా పెట్టుకోని ఈటల రాజేందర్ దేవుడి గురించి మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. రాగిడి లక్ష్మారెడ్డి పక్కా లోకల్. చదువుకున్న ఆయనను గెలిపిస్తే ప్రజల సమస్యలను పార్లమెంట్ లో వినిపిస్తడు. బీఆర్ఎస్ కు కేసీఆర్, కేటీఆర్ ఉన్నారు. రేవంత్ రెడ్డి మన వెంట్రుక కూడా పీకలేదు. మల్కాజ్ గిరి ఎంపీగా ఐదేళ్లలో రేవంత్ రెడ్డి ఒక్కసారైనా ముఖం చూపించిండా. బీజేపీతో కుమ్మక్కై డమ్మీ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డిని మల్కాజ్ గిరిలో నిలబెట్టిండు. హుజూరాబాద్ లో ఈటల దగ్గర రూ.25 కోట్లు తీసుకొని రేవంత్ రెడ్డి ఆయనకు సహకరించిండు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఊహించని పరిణామాలు జరగబోతున్నాయి. పదేళ్లలో కేసీఆర్ చేసినంత అభివృద్ధిని ఎవరైనా చేశారా? ఈటల రాజేందర్ అనే వ్యక్తి మోసగాడు. హుజూరాబాద్ లో ప్రజలు బుల్లెట్ దింపినట్లే.. మల్కాజ్ గిరి ప్రజలు కూడా ఆయనకు బుల్లెట్ దింపాలే'' అని కౌశిక్ రెడ్డి మాట్లాడారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఈటల రాజేందర్, కౌశిక్ రెడ్డి ప్రత్యర్థులుగా ఉన్న సంగతి తెలిసిందే. ఆ ఎన్నికల్లో కౌశిక్ రెడ్డి ఈటల రాజేందర్ పైన గెలుపొందారు. దాదాపు 17 వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు. అంతకుముందు 2021లో జరిగిన హుజూరాబాద్ ఉప ఎన్నికలో టీఆర్ఎస్ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్ పై బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ భారీ ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. గత ఎన్నికల్లో హుజూరాబాద్ లో ఈటల ఓటమితో ప్రస్తుతం మల్కాజ్ గిరి నుంచి పోటీ చేయడానికి బీజేపీ అధిష్ఠానం అవకాశం కల్పించింది.

## కంటోన్మెంట్ నుంచి నివేదిత

**హైదరాబాద్, మన చౌరాస్తా :** కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నివేదిత పేరును పార్టీ అధినేత కేసీఆర్ ఖరారు చేశారు. పార్టీ ముఖ్యులు, స్థానిక నేతలతో చర్చించిన అనంతరం దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు నివేదితను అభ్యర్థిగా ప్రకటించినట్లుగా బీఆర్ఎస్ పార్టీ అధికారిక ప్రకటన చేసింది. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే లాస్య నందిత మరణంతో ఆ స్థానంలో ఉప ఎన్నిక వచ్చిన సంగతి తెలిసిందే. కంటోన్మెంట్ దివంగత ఎమ్మెల్యే జి.సాయన్న కుమార్తె నివేదిత. 2023 ఫిబ్రవరిలో సాయన్న కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. 2023 నవంబరులో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో సాయన్న కుమార్తె లాస్య నందితకు కేసీఆర్ టికెట్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో లాస్య నందిత విజయం సాధించారు. కానీ, ఎన్నికల ఫలితాలు విడుదలైన మూడు నెలల వ్యవధిలోనే లాస్య నందిత ఓఆర్ఆర్ పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు.

## టెట్ దరఖాస్తు గడువు మరో 10 రోజులు పొడిగింపు

**హైదరాబాద్, మన చౌరాస్తా :** టెట్ 2024 దరఖాస్తు గడువును పొడిగించింది తెలంగాణ ప్రభుత్వం. బుధవారంతో టెట్ దరఖాస్తు గడువు ముగియడంతో.. దరఖాస్తు చేసుకోని అభ్యర్థులకు మరో అవకాశం కల్పించింది. మరో 10 రోజులు గడువును పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 20వ తేదీ వరకు గడువును పొడిగిస్తున్నట్లు ప్రకటించింది విద్యాశాఖ. ఈ నెల 11 నుండి 20వ తేదీ వరకు అప్లికేషన్ ఎడిట్ చేసుకోవడానికి అవకాశాన్ని కూడా కల్పించింది. మంగళవారం సాయంత్రం నాటికి మొత్తం 1,93,135 మంది దరఖాస్తు చేసుకున్నట్లు విద్యాశాఖ వెల్లడించింది. పేపర్ 1కు 72,771 దరఖాస్తులు రాగా.. పేపర్ 2కు 1,20,364 వచ్చాయని తెలిపింది. ఇక, టెట్ పరీక్ష మే 20 నుంచి జూన్ 3వ తేదీ వరకు జరగనుంది. జూన్ 12న ఫలితాలను వెల్లడిస్తారు.

## 14న వేలేరులో పెద్దమ్మ తల్లి జాతర

**ధర్మసాగర్, మన చౌరాస్తా :** ఈ నెల 14న వేలేరు మండల కేంద్రంలో పెద్దమ్మ తల్లి వేడుకలు నిర్వహించనున్నట్లు సొసైటీ చైర్మన్ ఇట్టబోయిన సంపత్ తెలిపారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్, గ్రోవర్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డిని మాజీ ఉప సర్పంచ్ సద్దాం హుస్సేన్ ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘం నాయకులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మతల్లి పండగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు బొమ్మెర బోయిన అనిల్, గ్రామ యూత్ అధ్యక్షుడు ఇట్టబోయిన శ్రీకాంత్ , ఉపాధ్యక్షుడు భరత్ కుమార్, అరవింద్, మహేందర్ లు పాల్గొన్నారు.

## వరంగల్‌లో ఉపాధ్యాయిని ఆత్మహత్యాయత్నం


**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేట శివారులోని మోడల్ స్కూల్లో పని చేస్తున్న ఉపాధ్యాయురాలు హారిక ఆత్మహత్యాయత్నం చేసింది. తోటి ఉపాధ్యాయుల వేధింపుల వల్లే ఆత్మహత్యకు పాల్పడిందంటున్న బంధువులు ఆరోపిస్తున్నారు. దోమల రాకుండా ఉండేందుకు ఉపయోగించే లిక్విడ్‌ను తాగి ఆత్మ హత్యయత్నానికి ప్రయత్నించింది. ప్రస్తుతం నర్సంపేటలోని ఆస్పత్రిలో ఉపాధ్యాయురాలు హారిక చికిత్స పొందుతున్నారు. ఆమె ఆరోగ్యం నికడగానే ఉంది.

Local News

# కేసీఆర్ హయాంలోనే తెలంగాణ అభివృద్ధి

## – జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

**జనగామ, మన చౌరాస్తా :** కేసీఆర్ అధికారంలోకి వచ్చాకే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జనగామ మండలం పసరమడ్ల గ్రామ పరిధిలోని ఉషోదయ ఫంక్షన్ హాల్‌లో పల్లా అధ్యక్షతన బీఆర్ఎస్ జనగామ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సన్నాహాక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి కామ్య మల్లేష్, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఇంతవరకు చేయలేదన్నారు. రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నా ఇప్పటి వరకు రైతుబంధు ఇవ్వడం లేదన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాను జనగామ ఎమ్మెల్యే గెలిచిన అప్పటి నుంచి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటిని పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. కొందరు వ్యక్తిగత




ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పార్టీ వదిలి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరుగుతుందని, ఎవరు ఎటుపోయినా.. జనగామ గడ్డ బీఆర్ఎస్ అడ్డా అని పల్లా అన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలుపొందాక తన సొంత ఆస్పత్రిలో ఇప్పటి వరకు జనగామ నియోజకవర్గంలో 5,200 మందికి మూడు కోట్ల వరకు ఉచితంగా వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## జనగామలో గ్రూపుల్లేవ్..

### మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి



జనగామ నియోజకవర్గంలో ఎటువంటి గ్రూప్ తగాదాలు లేవని మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. భువనగిరి పార్లమెంటు ఎన్నికల్లో గతంలో జనగామ నియోజకవర్గం నుంచి వచ్చిన ఓట్ల కంటే డబుల్ ఓట్లను తీసుకువచ్చి బీఆర్ఎస్ అభ్యర్థి మల్లేశ్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమం నుంచి అనేక అనుభవం ఉన్న కార్యకర్తలు జనగామ నియోజకవర్గంలో ఉన్నారన్నారు. కొంతమంది ఎమ్మెల్యేలు, నాయకులు బీఆర్ఎస్ పార్టీలో పదవులను అనుభవించి, వారి స్వార్థ రాజకీయ కోసం పార్టీలను మారుతున్నారని అన్నారు. పార్టీలు మారే వారిని ప్రజలు చీరి కొయ్యలకు వేస్తారని ఎద్దేవ చేశారు. బీఆర్ యస్ ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలంగా ఉండేదని, నాలుగు నెలల పరిపాలనలో ఎలా ఉందో ప్రజల కళ్ల ముందు కనిపిస్తుందన్నారు. కేసీఆర్ హయాంలో ఎండాకాలంలో కూడా చెరువులు మత్తళ్లు దూకేవని, కాంగ్రెస్ హయాంలో పంట పొలాలకు నీరు అందక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కరెంటు కష్టాలు మొదలయ్యాయన్నారు. కాంగ్రెస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామ కిరణ్ కుమార్ రెడ్డి ఎక్కడ ఉంటాడు ఏమి చేస్తాడో ఎవరికీ తెలియదన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి మల్లేష్ ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి 17 సీట్లు ఖాయమన్నారు.

# సామాజిక మార్పులో కవులపాత్ర కీలకం

**జనగామ, మన చౌరాస్తా :** సమాజంలో ఉన్న వివిధ సమస్యలను ఎత్తిచూపుతూ, ప్రజల పక్షం వహిస్తూ , తమ కవితల ద్వారా సమాజమార్పుకు కృషిచేయడంలో కవుల పాత్ర కీలకమని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రావు అన్నారు. క్రోధి నామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జనగామ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక రైల్వే స్టేషన్ రోడ్ లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో 'సామాజిక కవి సమ్మేళనానికి' శ్రీకారం చుట్టించారు. సభకు జరసం గౌరవాధ్యక్షుడు పొట్టబత్తిని భాస్కర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిలుగా చంద్రశేఖరరావు, విశిష్ట అతిథిగా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస రావు, ఆత్మీయ అతిథిగా కవులు, కళాకారుల ఐక్య వేదిక జనగామ జిల్లా కన్వీనర్ జి.కృష్ణ,




ప్రత్యేకత అహ్వానితులుగా గూడెల్లి కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రావు మాట్లాడుతూ అనేక సామాజిక సమస్యలు సమాజాన్ని పట్టిపీడుస్తున్నాయని, నిరుద్యోగం పెరిగే ధరలు, కులోన్మాదం, మతోన్మాదం సమాజంలో పెరిగిపోతున్న అంతరాలు అన్నింటితో పాటు, యువతలో ఈ మధ్య పెరిగిపోతున్న కొత్త కొత్త పోకడలను తెలియజేయడానికి సామాజిక కవి సమ్మేళనాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కవి సమ్మేళనంలో 24 మంది కవులు, రచయితలు, ప్రజాగాయకులు, వాగ్గేయకారులు పాల్గొని వారి కవితా గానాన్ని వినిపించారు. కవి సమ్మేళనంలో శేషుకుమార్, జైపాల్ రెడ్డి, అంజయ్య, సుదర్శన్, మహేందర్, జైపాల్‌రెడ్డి, ప్రసాద్, శ్రీధర్, కాశీ రామ్, శివనాథ్‌తో పాటు అగయ్య, నవీన్, రవీందర్, వనం నర్సింహులు, మహేష్ పాల్గొన్నారు.



## కుమ్మరి సంఘం భవనానికి రూ.30వేలు విరాళం

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** కేసిరెడ్డిపల్లేలో కుమ్మరి సంఘం భవన నిర్మాణానికి ఇమ్మడి జితేందర్ రెడ్డి రూ.30 వేల విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సేవ కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకొని, కేసిరెడ్డిపల్లేలో కుమ్మరి సంఘం భవన నిర్మాణానికి తాను విరాళం అంచానని చెప్పారు. కార్యక్రమంలోఎల్లయ్య, ఐలయ్య, బాల నరసయ్య, కృష్ణ, రాములు, నరసింహులు, నాగరాజు, సత్తయ్య, యాదగిరి, కిట్టయ్య,, కాపర్తి హరిప్రసాద్ పాల్గొన్నారు.



## మిత్రుడి కుటుంబానికి అండగా పూర్వ విద్యార్థులు

బచ్చన్నపేట, మన చౌరాస్తా : మిత్రుడి కుటుంబానికి అండగా పూర్వ విద్యార్థులు నిలిచారు. మిత్రుడు కుటుంబానికి పూర్వ విద్యార్థులు ఆర్ధిక సహాయం చేశారు. 2000 సంవత్సరం బ్యాచ్ మిత్రుడు నడిమింటి బాలరాజు మరణించిన విషయం తెలుసుకున క్లాస్ మెంట్ మిత్రులు ఆయన కుటుంబాన్ని పరామర్శించి రూ.20 వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో ఏంటే శ్రీనివాస్, కోపురపు రమేష్ రెడ్డి, రజినీకాంత్, జుకంటి రాజు, చల్ల కిషన్, కందుకూరి రాజు, తాటికొండ ఉపేందర్, ఆలేటి రాజేందర్ పాల్గొన్నారు.



## కొన్నెలో చలివేంద్రం ప్రారంభం

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** కోడూరు శివకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. కొన్నె గ్రామంలో ప్రజలు, ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు శివకుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మల్ల సిద్ధిరాములు, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సిద్ధారెడ్డి, కురమ్ వెంకటయ్య, చెవిటి శ్రీకాంత్, ఇటికాల అభినయ్, శ్రీనివాస్, యట కనకరాజు, తేలు కిష్టయ్య, అంబాల ఎల్లయ్య, కందుకూరి రాజు పాల్గొన్నారు.

# ఉత్కంఠ పోరులో గుజరాత్ గెలుపు

- రాజస్థాన్ పై 3 వికెట్ల తేడాతో విజయం
- గుజరాత్ ముందు 197 టార్గెట్
- రాణించిన పరాగ్ (76), శాంసన్ (68)
- ఆఖరి బంతి వరకు ఉత్కంఠగా సాగిన మ్యాచ్
- ఫోర్ కొట్టి గెలిపించిన రషీద్ ఖాన్ఆర్ఆర్ వరుస విజయాలకు బ్రేక్




**మనచౌరాస్తా, క్రీడా విభాగం :**
ఐపీఎల్ 17 సీజన్ లో రసవత్తరంగా సాగుతోంది. ఒక మ్యాచ్ ని మించి మరో మ్యాచ్ థ్రిల్ ని పంచుతోంది. మంగళవారం హైదరాబాద్పంజాబ్ ల మధ్య జరిగిన మ్యాచ్ నరాలు తెగ ఉత్కంఠగా జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఉత్కంఠ పోరులో సన్ రైజర్స్ రెండు పరుగుల తేడాతో విజయం సాధించింది. బుధవారం గుజరాత్రాజస్థాన్ ల మధ్య జరిగిన మ్యాచ్ కూడా అంతకుమించి అన్నట్టుగా సాగింది. ఆఖరి బంతి వరకు విజయం దోబూచులాడింది. ఆఖరి ఓవర్ లో 15 పరుగులు అవసరం కాగా.. రషీద్ ఖాన్ రెండు ఫోర్లు కొట్టి గుజరాత్ ను గట్టెక్కించాడు.
ఈ మ్యాచ్ లో టాస్ ఓడి మొదటి బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. రియాన్ పరాగ్ (76; 48 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్సలు), సంజు శాంసన్ (68*; 38 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సలు) దంచికొట్టారు. యశస్వి జైస్వాల్ (24), జోస్ బట్లర్ (8) నిరాశపరిచారు. హెట్మయర్ (13*; 5 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స) ఆఖర్ లో మెరుపులు మెరిపించాడు. వాస్తవానికి ఆర్ ఆర్ ప్రారంభంలో కాస్త నెమ్మదిగానే ఆడింది. 10 ఓవర్లకు రాజస్థాన్ స్కోరు 73/2. అయితే క్రమంగా గేర్ మార్చారు. చివరి 10 ఓవర్లలో రాజస్థాన్ బ్యాటర్లు 123 పరుగులు రాబట్టారు. పరాగ్ అవుటైన తర్వాత కూడా ఆర్ ఆర్ బ్యాటర్ల దూకుడు తగ్గలేదు. హెట్మయర్ ఛార్జ్ తీసుకోవడంతో భారీ స్కోర్ సాధించగలిగింది. గుజరాత్ బౌలర్లలో ఉమేశ్ యాదవ్, రషీద్ ఖాన్, మోహిత్ శర్మ ఒక్కో వికెట్ పడగొట్టారు.
అనంతరం 197 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన గుజరాత్ 7 వికెట్లు కోల్పోయి ఇన్నింగ్స్ చివరి బంతికి విజయం సాధించింది. చివరి బంతికి రెండు పరుగులు అవసరం కాగా, రషీద్ ఖాన్ (24: 11 బంతుల్లో 4 ఫోర్లు) ఫోర్ కొట్టి తన జట్టును గెలిపించాడు. కెప్టెన్ శుభ్మన్ గిల్ (72: 44 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సలు) సూపర్ బ్యాటింగ్ చేసినప్పటికీ.. కీలక సమయంలో ఔటయ్యాడు. ఓపెనర్ సాయి సుదర్శన్ (35: 29 బంతుల్లో 3 ఫోర్లు, ఒక సిక్స), తెవాతియా (22) విలువైన పరుగులు చేశారు. రాజస్థాన్ బౌలర్లలో కుల్దీప్ సేన్ 3, చాహల్ 2 వికెట్లు తీశారు.



### 6 బాల్స్.. 15 పరుగులు

18 ఓవర్ కూడా రాజస్థాన్ కే గెలుపు అవకాశాలు ఎక్కువగా కనిపించాయి. 18 ఓవర్లకు గుజరాత్ స్కోర్ 162/6. రషీద్ ఖాన్ (2), రాహుల్ తెవాటియా (11) పరుగులతో ఉన్నారు. గుజరాత్ విజయానికి చివరి రెండు ఓవర్లలో 35 పరుగులు అవసరం. ఇలాంటి సమయంలో ఇంకో వికెట్ పడితే ఆర్ ఆర్ విజయం మరింత సులువు అయ్యేది. కానీ వీరిద్దరు చెలరేగి ఆడారు. కులదీప్ వేసిన 19 ఓవర్ లో ఏకంగా 20 పరుగులు రాబట్టారు. దీంతో ఆఖరి ఓవర్ లో 15 పరుగులు అవసరం అయ్యాయి. అయితే తొలి బాల్, ఆఖరి బాల్ కు ఫోర్ కొటి రషీద్ ఖాన్ మ్యాచ్ ను గెలిపించాడు. మధ్యలో తెవాటియా రన్ అవుట్ అయినా.. గుజరాత్ గెలుపు ఆగలేదు.

**రాజస్థాన్ విజయాలకు బ్రేక్**

ఈ సీజన్ లో రాజస్థాన్ వరుసగా నాలుగు విజయాలు సాధించింది. జోరుమీద కనబడింది. ప్రత్యర్థి ఎవరైనా విజయం మాదే అన్నట్టుగా సంజూ శాంసన్ సేన దూసుకుపోయింది. అయితే గెలుపు కిక్కులో ఉన్న ఆర్ ఆర్ కు ఓటమి రుచి చూపించింది గుజరాత్. భారీ లక్ష్యం ముందున్నా.. చేయాల్సిన రన్ రేట్ పెరిగిపోతున్నా బెదరలేదు. ఆఖరి వరకు పోరాడింది. ఆఖరి బంతికి ఫోర్ కొట్టి గెలిచింది. ఈ గెలుపు క్రెడిట్ రషీద్ ఖాన్ , తేవాటియా కు దక్కుతుంది అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ప్రెజర్ లో చక్కటి ప్లేస్ మెంట్ తో పరుగులు రాబట్టారు. ముఖ్యంగా రషీద్ ఖాన్ ఆఖరి బంతికి కొట్టిన ఫోర్ అదిరిపోయింది.

WANTED విలేకరులు కావలెను

www.manachourasta.com
మన చౌరాస్తా
The Complete News way

'మన చౌరాస్తా' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'మన చౌరాస్తా' సాదర స్వాగతం పలుకుతోంది.
సెల్ : 9676400812